# మనసు నిండుకుంది



బ్రాహ్మ ముహూర్తం.

వెలుగురేకలు వైకుంఠపురం కొండమీంచి విచ్చుకోకముందు ఊరి జనమంతా కృష్ణ వొడ్డుకొచ్చారు. సంచారం చేస్తూ వచ్చిన శంకారాచార్యుల వారు కృష్ణ స్నానానికి సమయం నిర్ణయించారు. అన్ని వర్గాలవారు, ఆడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలతో సహా ఆచార్యులవారితో కలిసి కృష్ణలో స్నానం చేద్దామని తరలివచ్చారు.

కృష్ణమ్మ నిండుగా పారుతోంది.

అలలు అలలుగా తుళ్లి తుళ్లి పడుతోంది. శంకరాచార్యులవారు దండ

కమండలధారియై కృష్ణ ఒడ్డుకు వచ్చారు. వస్తూనే కృష్ణాజలం వొకింత తలమీద చల్లుకుని నదిలోకి దిగారు. ఆచార్యులతో పాటు జనమంతా నదిలోకి దిగారు. శంకరాచార్యులవారు మూడుసార్లు మునకలు వేశారు.

జనమంతా 'హరా' అంటూ తల మునకలుగా స్నానాలు చేశారు. కృష్ణమ్మ జలదరించింది. పొంగి పొంగి పారింది. జనం గుండెలు పొంగాయి. అందరి దృష్టి ఆచార్యుల వారిమీదే. ఆచార్యులవారి దృష్టి అల్లంత దూరాన తూర్పు కొండలవైపు ఉంది.

సీతాపతికి ఒళ్ళు పులకలెత్తింది. తనెన్నిసార్లు ఈ కృష్ణలో స్నానం చేశాడు కాదు. ఎన్నడూ తన శరీరం ఇంత పరవశించలేదే! ఆచార్యుల వారి స్పర్శతో, వందనంతో కృష్ణానది కరుణించి పావిత్ర్యం వర్షిస్తున్నట్టుంది. ప్రవాహపు స్పర్శ నరనరాల్లోకి పాకి కదిలించి వేస్తోంది. ఇంత మహత్తర దృశ్యం నేనూ చూడాలని తొందరపడుతున్నట్లు సూర్యుడు చరచర కొండవెనకనుంచి లేచి వచ్చాడు. అప్పటికే శంకరాచార్యులవారు స్నానం ముగించి పురాణబ్బండ మీద కూర్చున్నారు. ఎదురు వస్తున్న సూర్యుడికి అర్ఘ్యమిచ్చి వందనం చేస్తున్నారు. ఉదయ సూర్య కిరణాల కాంతిలో కాషాయదండం మెరిసిపోతోంది. ఆచార్యులవారు అనుష్ఠానంలో మునిగిపోయారు. ఈ దృశ్యం చూస్తున్న జనానికి గుండె పొంగిపోయింది. సీతాపతికి వేయిశివరాత్రులు కలిసి వచ్చినట్లనిపించింది. ఈ మహత్తరస్నానం కోసమే బతికి ఉన్నానా అనిపించింది.

మరోపక్క రామలింగం కూడా స్నానం చేస్తున్నాడు. అతనికేమీ అనిపించడం లేదు. ఏ పులకింతా లేదు. అందరితోపాటు తనూ స్నానానికి వచ్చాడు. ఎవరికీ చేయెత్తి మొక్కలేదు. నోరారా "హరా!" అనలేదు. అతనికి వీటియందు విశ్వాసం లేదు. అంతమాత్రాన ఏహ్యమూ లేదు. చిత్రం! ఆస్తికుడైన సీతాపతి, నాస్తికుడైన రామలింగం ప్రాణస్నేహితులు. రామలింగం సీతాపతిని చూసి ఆశ్చర్యపోతున్నాడు. అతనిలో విచిత్రమైన మార్పు వస్తోంది. కళ్ళు వెలిగిపోతున్నాయి. శరీరం వూగిపోతోంధి. పసిపిల్లవాడు తల్లి వొడిలో

వొదిగిపోయినట్లు కృష్ణమ్మని మనసా కౌగిలించుకుంటున్నాడు. పదేపదే మునకలేస్తున్నాడు. రామలింగం చూట్టూ కలయజూశాడు. అందరూ తన్మయావస్థలో వున్నారు. కాని తనకేమీ అనిపించడం లేదు.

శంకరాచార్యులవారు స్నానం జపం ముగించుకుని వొడ్డుకొచ్చారు. నీళ్లోడుతున్న తలలతో జనమంతా వారి ననుసరించారు. కృష్ణమ్మకి, పైపైకి వస్తున్న సూర్యభగవానుడికి వందనాలు చేసి అమరేశ్వరాలయం వైపు దోవతీశారు శంకరాచార్యులు. అమరావతి అమరావతంతా ఆలయానికి తరలి వస్తున్నట్లుంది. వేదమంత్రాలు మోగుతున్నాయి. అందరి ముఖాల్లో భక్తి. ముకుళించిన చేతులు, మూసుకుపోతున్న కళ్ళు, ఉలికులికి పడుతున్న గుండెలు. వేదం వీధులనిండా మార్మోగింది. గాలినిండా వేదనాదం. ఆ నాదానికి తోడుగా ధ్వజస్తంభం చిరుగంటల మోతలు. అందరితో కలిసిగుళ్ళో కొచ్చారు సీతాపతి, రామలింగం.

ప్రాకారాల నిండా వేదనాదం. పావుకోళ్ళు టక టక లాడించుకుంటూ శంకరాచార్యులవారు కాషాయదండంతో రెండో ప్రాకారంలోకొచ్చి నాలుగు మారేడుదళాలు, నాలుగు జమ్మిరెమ్మలుకోసి కమండలంలో వేసుకున్నారు. మారేడుచెట్లు సంబరంతో ఊగాయి. గాలిగోపురంలో పావురాళ్ళు రెక్కలు తపతప కొట్టుకుంటూ ఆకాశంలోకి ఎగిరాయి. మెట్లెక్కి దేవాలయంలో కొచ్చారు. అమరావతంతా ఆలయంలోకి వచ్చింది. శంకరాచార్యులు గర్భగుడిలోకి ప్రవేశించారు. గంటలు మోగాయి. "హర హర మహాదేవ!" కేకలతో గుడి నిండిపోయింది. మహాన్యాసంతో స్వామికి అభిషేకం చేస్తున్నారు. శంకరాచార్యుల వారు. అమరేశ్వరుడి పాలరాతి విగ్రహం మెరిసిపోతోంది. చల్లగా మెల్లగా నవ్వుతున్నాడు శివుడు. శంకరాచార్యులవారు స్వామికి కర్పూర హారతి ఇస్తూంటే అందరి కళ్ళలో హారతులు వెలిగాయి. ఎదురుగా ఉన్న నందీశ్వరుడి కళ్ళు వెలిగాయి.

ఆ తర్వాత శంకరాచార్యులు బాలచాముండేశ్వరి దగ్గరికొచ్చారు. ఆయమ్మ

ఆదిశంకరుల ప్రతిష్ఠ. శ్రీ సూక్త విధానంగా అమ్మకు అర్చన చేయించారు. తల్లి నవ్వుతోంది. మనసా ఆశీర్వదిస్తోంది అందరూ కుంకుమ ముఖాలకు పెట్టుకున్నారు. అదే స్వామి! అదే అమ్మ! ఆనాడు సరికొత్తగా దివ్యదర్శనం ఇస్తున్నట్లనిపించింది అందరికీ.

శంకరాచార్యులవారు అర్చనలు ముగించుకుని గుడినుంచి వెళ్ళిపోయారు. వారితోపాటే జనమంతా వెళ్ళిపోయారు. గుడి ఖాళీగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. ఇద్దరే ఉన్నారు గుళ్ళో. ఒకరు సీతాపతి, రెండోవాడు అతని స్నేహితుడు రామలింగం. సీతాపతికి గుడినుంచి వెళ్ళబుద్ధి కావటం లేదు. అతనికి ఆ పారవశ్యం, పులకింత ఇంకా తగ్గలేదు. అలా నంది పాదాలచెంత స్వామి కెదురుగా కళ్ళు మూసుకు కూర్చున్నాడు. కొంతసేపటికి కళ్ళు తెరిచిచూస్తే పక్కన రామలింగం కన్పించాడు.

"ఇక్కడే ఉన్నావా?" అన్నాడు సీతాపతి.

'మరేం' అన్నాడు రామలింగం.

"నువ్వు నాస్తికుడివి. జరిగిందంతా మాశావుకదా! నీకేమనిపించింది" అడిగాడు సీతాపతి.

"నాకేమీ అనిపించలేదు. నా మనసు ఖాళీగా ఉంది." అన్నాడు రామలింగం.

సీతాపతి ముఖంలో చిరునవ్వు- "నా మనసూ ఖాళీగానే ఉందయ్యా" అన్నాడు.

"అయితే అందులో ఏం నింపుకోవాలి?" అడిగాడు రామలింగం.

"అందులో మనసునే నింపుకోవాలి" సమాధానం చెప్పాడు సీతాపతి. ఇద్దరూ ఒకర్ని ఒకరు చూసి ఒకరు నవ్వుకున్నారు.

నిజం! ఉన్నప్పుడు లేనిదానికోసం పరుగు! లేనప్పుడు ఉన్నదాని కోసం తపన! అనుభూతి పునరావృతం కావటంకోసం అహరహం ఆరాటం!

అర్చకుడు ఇద్దరికీ తీర్థం ఇచ్చాడు. రామలింగం దాహానికి గొంతు తడుపుకున్నాడు. సీతాపతి గంగోదకంగా భావించి కళ్ళకద్దుకుని స్వీకరించాడు.*